# ఆమె నవ్వింది

**డి.బి. వెంకటరత్నం**



"చిల్లర వుందాలండీ అందరిదగ్గరా.... చిల్లర వుంటేనే బస్సులో ఎక్కండి...." కండక్టర్ హెచ్చరికలు.

"అరె....కొంచెంపైకి జరగండయ్యా!"

"ఇంకెక్కడికి జరగాలీ...."

"అబ్బా! నా కాలు....కాలు తొక్కేసినావయ్యా బాబూ."

"అబ్బెబ్బె! ఆర్టీ సీలో వస్తున్నాం మాస్టారూ. ఇదివరకటి ప్రయివేటు బస్సులే నయ్యం...."

"ఏటింతసేపు ఆపేసినావు. పోనీవయ్యా."

"కండక్టరూ. రెండూ అరవై విచ్చుకో."

"ఇరవయి పైసలు చిల్లరియ్య అం.... ఎవరండీ టిక్కెట్స్."

"ఇదిగో. సీతమ్మదార ఒకటి."

"సింధియాకోటి. ద్వైదాకోటి."

లెఫ్ట్‌హేండ్ సైడ్ సింగిల్ సీట్లో కూర్చున్న నాకు. మాటలన్నీ విడివిడిగా కలగాపులగంగా.... గొడవ గొడవగా వినబడుతున్నాయి.

విశాఖ సిటీబస్సులో రోజూ ఈ బాధలు తప్పవు.

బస్సు నిండిపోయి ఇరుగ్గా, చిరాగ్గా ఉంది.

అయినా. కూర్చోటానికి చోటు దొరికింది కనుక కొంతలో కొంత నయం.

నా పక్కన నుంచున్నతని చెయ్యి తల మీద గట్టిగా తగిలింది.

"సారీ....!" గబుక్కున అన్నాడు.

తల తడుముకుంటూ అతనివైపు చూశాను. ఒకచేత్తో కుర్రాడ్ని ఎత్తుకుని, మరో చేత్తో బస్సుకడ్డీ పట్టుకుని అవస్థ పడుతున్నాడు.

అతన్ని చూస్తుంటే జాలేసింది.

చేతులు చాపి. అతని చేతిలో కుర్రాడ్ని అందుకుని నా ఒళ్ళో కూర్చోపెట్టుకున్నాను. రెండు సంవత్సరాలు ఉంటుంది ఆ కుర్రాడి వయసు. మహా చలాకీగా ఉన్నాడు.

కాసేపు నా జేబులో కాయితాల్తోనూ, మరికాసేపు నా జుట్టుతోనూ ఆటలాడాడు. జుట్టు విడిపించుకుని కుదురుగా కూర్చోపెట్టాను. అబ్బే ఉంటేనా! కూర్చునే వచ్చీరాని మాటల్తో అల్లరి చేస్తున్నాడు.

బస్సు సింధియా జంక్షన్‌కి వచ్చేసరికి కాస్త ఖాళీ అయ్యింది.

అప్పుడు చూశాను- ముందు వైపు నుంచుని నావైపు చూస్తున్న ఆమెని.

అందంగానే ఉందని చెప్పాలి. చేతిలో లావాటి బైండ్ బుక్. బహుశా యూనివర్సిటీ అమ్మాయి అయివుంటుంది

నేను ఆమెవైపు చూడగానే క్షణంలో.... సగంలో. ఆమె పెదవులమీద మెరిసి మాయమైన చిఱునవ్వు. అంతకంటె ఏం కావాలి?

అదీగాక, అప్పుడప్పుడూ ఆమె వెనుతిరిగి చూస్తూనే ఉంది. నా నవ్వుకి చిరునవ్వు సమాధానాలు లభిస్తూనే ఉన్నాయి.

ఆమె ఎక్కడ దిగుతుందో....మనం కూడా అక్కడే దిగేస్తే....జగదాంబలో పిక్చర్ చూపించి, అట్నుంచి అలా అలా—

అదుపు తప్పిన మనసు ఇష్టంవచ్చినట్టు ఆలోచిస్తోంది.

ఆమె పేరు ఏమయి ఉంటుంది....

పద్మ....పార్వతి . లక్ష్మి..అన్నపూర్ణ.. తెలుగుపేర్లు వరుసగా మనసులోకి వస్తున్నాయి.

ఏ పేరయితేనేం అమ్మాయి బాగుంది.

చుఱుక్కుమంది.

ఒళ్ళో కూర్చున్న కుర్రాడు మీసం పట్టుకుని లాగేడు. అప్పుడు వచ్చింది అయిడియా.

ఈసారి ఆమె వెనక్కి తిరగ్గానే వాడి బుగ్గమీద ముద్దులు పెట్టుకున్నాను—కళ్ళతో ఆమెకి సందేశం పంపుతూ.

చటుక్కున అటు తిరిగిపోయింది. మళ్ళీ వెనక్కి తిరగలేదు.

బస్సు చావులమదుం దగ్గర ఆగింది. నా చేతిలో కుర్రాడ్ని తీసుకుని 'థాంక్స్' చెప్పి దిగిపోయాడు నా ప్రక్కనే నుంచున్న వ్యక్తి.

ఆమె కోసం చూశాను.

బస్ దిగుతోంది.

దిగుతూ ఓరగా చూసింది. ఆమె పెదాల మీద నవ్వు మెరసి మాయమైంది.

బస్సు కదిలింది.

మరి కాసేపు ఆవకూడదూ! వీడి సొమ్మేం పోయిందీ—మనసులో బస్ డ్రైవర్ని తిట్టుకుంటూ ఆమె కోసం బస్సులోంచి వెనక్కి చూశాను.

ఆమె పిల్లాడ్ని అందుకుంటూంది అతని నుంచి.ఆ కుర్రాడు అంతవరకూ నా ఒళ్ళో కూర్చున్నవాడే!

"అంటే....అంటే...."

ఇక ఆలోచించడం మానేసి తల బస్సులోకి తిప్పేశా! ●

---

"అయితే గాయకుడు హరిశ్చంద్ర నీకు బాగా తెలుసంటావ్."

"తెలుసు అనడమేమిటి....వాడూ, నేనూ ఓనమాల నుంచి ఉద్యోగం వచ్చేవరకూ సహాధ్యాయులం. ఒకే కంచంలో తినేవాళ్ళం. ఒకే మంచంలో పడుకుండేవాళ్ళం. పి.జిలో. ఉండగా వాడు నన్ను ప్రత్యేకంగా బీచ్‌కు తీసుకువెళ్ళి పాటలు పాడి మరీ వినిపించేవాడు. నేనూ అంతే. మనవెప్పుడైనా బాగోకపోతే. వాడివి నిద్రపోతున్నా సరే లేపి పాడించి వినేవాడిని. అనకూడదు గానీ వాడు నా స్నేహితుడని చెప్పుకోవడం నాకు గర్వకారణం."

"అయితే తప్పకుండా నాకు ఛాన్సుయిస్తాడన్న మాట."

"తప్పకుండా....నువ్వే చూస్తావుగా."

ఆకాశవాణి కాంపౌండ్‌లోకి అడుగుపెడుతూ చంద్రం సూర్యానికి అభయం యిచ్చేశాడు.

ఎంక్వయిరీలో హరిశ్చంద్ర గురించి వాకబు చేస్తే రికార్డింగ్‌లో ఉన్నాడని తెలిసింది. పిలిపించమని విజిటర్స్ కార్నర్‌లో కూర్చున్నారు.

"అన్నట్టు .... చంద్రం .... నీ బియ్యే క్లాస్‌మేట్ ఎవడో యిక్కడే పని చేస్తున్నాడని అన్నావ్....అతన్నికూడా కలిస్తే ..." సూర్యం నస.

"అతన్నిచూచి ఎప్పుడో ఆరేళ్ళవుతుంది.

అయినా అతన్ని చూచేదేమిటి....ఏదోకొద్ది పరిచయం తప్పితే...."

"కొద్ది పరిచయమైనా....దాన్ని సద్విని యోగపరచుకుందాం...."

"ఏం వద్దులే....నసపెట్టకు....అయినా ఎందుకు....కొండంత అండ హరిశ్చంద్రదే నాకు తెలిసుంటే."

స్టూడియో స్పీకర్‌లోంచి సన్నగా పాట విన్పిస్తోంది.

"సృష్టిలో తీయనిది స్నేహ మేనోయ్.."

పాట అయిపోవచ్చింది. స్టూడియో తలుపు తెరుచుకొని ఓ ఉగ్ర నరసింహం బయటికొచ్చి ఎంక్వయిరీ నడుగుతున్నాడు. "ఎవరూ....నన్ను పిలిచింది .... ఎందుకు పిలిచారు....ఎవడు నన్ను కలుసుకోడాని కొచ్చింది...." చిందులు వేయడం మొదలు పెట్టాడు.

"నేనేరా... " సూర్యాన్ని తీసుకొని ముందుకడుగేశాడు చంద్రం

"మీరెవరో నాకు తెలియదే..."విసురుగా అన్నాడు.

"నేనురా.. చంద్రాన్ని..నీ క్లాస్‌మెట్‌ని" సగం చచ్చిన చంద్రం పేలవంగా అన్నాడు.

"ఎప్పుడు.. నా క్లాస్‌మేట్‌వి? అయినా అర్జంటుగా రికార్డింగ్ జరుగుతోంటె పిలిపించడమేనా" విసుగ్గా అన్నాడు.

"ప్రత్యేకంగా మీ గురించే చాలా దూరం నుంచి వచ్చాం! మీ యింటి అడ్రస్ తెలియదు.ఓ పని గురించి మీ దగ్గరకు వచ్చాం" సూర్యం వినయంగా చెప్పాడు.

"నాకిప్పుడు తీరికలేదు. మరొకసారొచ్చినప్పుడు కలవండి" మాటలు పూర్తయ్యేసరికి మనిషి అదృశ్యం! చంద్రంముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

"నిన్ను ఎంతో ఆశపెట్టి తీసుకువచ్చా బ్రదర్। నిరాశేమిగిలింది. ఈ దౌర్భాగ్యుడు మారతాడనుకోలేదు" తెలివి తెచ్చుకుంటూ నీరసంగా అన్నాడు చంద్రం.

"పోనీలే.... మనకు ప్రాప్తం లేదు.... పోదాం పద "

స్పీకర్‌లోంచి మరో పాట వినిపిస్తోంది:

"అనుబంధం.... ఆత్మీయత అంతా ఓ
బూటకం....
ఆత్మతృప్తికై మనుషులు ఆడుకొనే
నాటకం...."

గేటు లోంచి వచ్చేస్తోంటే వెనకగా చప్పట్లు. ఎవరో చంద్రాన్ని చూపించి మరీ చప్పట్లు కొట్టారు. చంద్రానికెవరో అర్థం కాలేదు. అంతలోకి అతనే దగ్గరి కొచ్చేశాడు.

"హల్లో బ్రదర్" అంటూ అమాంతం కావిలించేసుకున్నాడు.

బిత్తరపోయాడు చంద్రం!

"నన్ను గుర్తుపట్టలేదా...." అర్థోక్తిలో అడిగాడు.

"లేదే.. లేదు.. లేదండి.." తడబడ్డాడు చంద్రం.

"నేను..నీకు ఒక్క సంవత్సరం బియ్యేలో క్లాస్‌మేట్. భాస్కరాన్ని."

"ఓహో....నువ్వా...."

"అవును నేనే! యిక్కడ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నా! అయినా యిక్కడ నుంచొని మాట్లాడడమేమిటి? లోపలకు పోదాం.. రండి సార్."

స్నేహపూర్వకంగా చంద్రం చేయి పట్టుకొని తీసుకువెళ్తొంటే అనుసరించాడు సూర్యం.

"అంతా బావున్నారా..పిల్లలెంతమంది? వదినగారు బావున్నారా! ఎంతయినా స్టూడెంట్ రోజులు మళ్ళీరావు చంద్రం! అదొక మధుర స్వప్నం. నెమరు వేసుకోవాల్సిందే. అన్నట్లు నీ రచనా వ్యాసంగం ఎలా ఉంది? అప్పుడేవేవో కవితలు వ్రాసి వినిపించేవాడివి.. అయినా లలితకళలు అబ్బటానికైనా పూర్వ జన్మ సుకృతం ఉండాలి. అందుకే ఎప్పుడూ నువ్వే జ్ఞాపకం వస్తుంటావు...." ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. తేరుకొని చంద్రం ఊఁ ఊఁ అంటున్నాడు.

ఇంతలో కూల్ డ్రింక్స్ టేబిల్ మీది కొచ్చాయి.

"తీసుకో చంద్రం: మీరూ తీసుకోండి.."

సిప్ చేయబోతూ అన్నాడు భాస్కరం.. "నీకు జ్ఞాపకం ఉందా.. సూర్యుడి కాంతి చంద్రునిమీద పడే వెన్నెలౌస్తుంది. కానీ యీ చంద్రం కాంతిపడే ఆనాడు భాస్కరం ప్రకాశించింది" తన్మయత్వంతో కళ్ళు మూసుకొన్నాడు.

షాక్‌లోంచి ఇంకాతేరుకోని చంద్రానికి మాటలు పెగలటంలేదు. ఆఖరికి గొంతు పెగిలించి అన్నాడు-"వీరు సూర్యం అని నా సహోద్యోగి. చక్కగా పాటలు పాడతారు. రేడియోఛాన్సు యిప్పిస్తానని నేను తీసుకువచ్చాను. ఎవరూ తెలిసినవాళ్ళు కనిపించకపోవడంతో తిరిగివెళ్తున్నాం."

"నేనున్నాననే సంగతి జ్ఞాపకం లేదా. ఉత్త చేతులతో తిరిగి వెళ్ళే ప్రశ్నేలేదు. యిప్పుడే ఆడిషన్ ఫాం తెప్పిస్తా. తప్పకుండా మీ వాడికి ఛాన్సు వచ్చేలా చూస్తా. ఈ రాత్రికి నా యింట్లోనే ఆతిథ్యం. మీరు ఊరికి వెళ్ళదలుచుకుంటే రేపు రాత్రికే! ఒక్కనిమిషంలో వస్తా. యింటికి ఫోన్ చేసి."




భాస్కరం వెళ్తోంటే చెబుతున్నాడు చంద్రం.

"ఇతనే సూర్యం!భాస్కరంఅనిచెప్పానే అతనే యితను. నా బియ్యే క్లాస్‌మేట్"

చంద్రం ముఖంలో మళ్ళీ శరత్ పూర్ణిమ కాంతులు.